క్లుప్తంగా

దివ్యాంగుల పింఛన్ల రద్దు దారుణం

సామర్లకోట: దివ్యాంగత్వం 40 శాతం కంటే తక్కువ ఉందనే సాకుతో దివ్యాంగులకు వచ్చే పింఛను తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ నాయకుడు, సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 13వ వార్డులో గత నాలుగేళ్ల నుంచి దివ్యాంగుల పింఛన్లు తీసుకొంటున్న ఐదుగురి పింఛన్లు వచ్చే నెల నుంచి రద్దు చేసినట్టు సచివాయం నుంచి సమాచారం వచ్చిందన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కళ్లు కనిపించని, వినిపించని వారి పింఛన్ల రద్దు చేయడం సరికాదన్నారు. దివ్యాంగత్వం ఉంటే పింఛన్లు అందజేయాలని సూచించారు. వందే దొరబాబు, సంగినీడి దేవి, కొత్ర భువనేశ్వరి, నొక్కు దుర్గాభవాని, దాకే అప్పారావుల ఫించన్లు రద్దు చేస్తున్నట్టు సమాచారం ఇచ్చారన్నారు.

పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా చిన్నా



ఆటో యూనియన్ నూతన కార్యవర్గం

సామర్లకోట: పట్టణ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రొంగల చిన్నా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, ఉండూరు, వేట్లపాలెం, కాకినాడ, రైల్వే స్టేషన్ పరిధిలోని యూనియన్ నాయకులు సమావేశం బుధవారం జరిగింది. ఈ మేరకు గతంలో ఉన్న కమిటీ కొనసాగించాలని నిర్ణయించారు. దాంతో ఉపాధ్యక్షుడిగా పి.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణ, కార్యదర్శిగా ఎస్.నాగరాజు, సహాయ కార్యదర్శిగా ఎస్.చక్రం, కోశాధికారిగా ఎం.రాజన్న, న్యాయ సలహాదారుడిగా ముమ్మితి సత్తిబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.సత్తిబాబు, ఎండీ రహీమ్, జి.రమణ, బి.బోసుబాబు, బి.రామకృష్ణ ఎన్నికయ్యారు.

సమాజ హితం కోరేదే వేదం

బోట్క్లబ్: వేదం సమాజ హితాన్ని, శ్రేయస్సును కోరుకుంటుందని అందుకే వేదం ప్రతి ఒక్కరూ శ్రవణం చేయాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ అన్నారు. శ్రీమద్ ఆంధ్ర వేద శాస్త్ర పరిషత్ 71వ వసంతాల వేద సభ బుధవారం స్థానిక రామారావు పేటలో ఉన్న గాయత్రి మండపంలో పరిషత్ అధ్యక్షుడు శ్రీరామ భగవతి అధ్యక్షతన జరిగింది. తొలుత గాయత్రి మాత చిత్రపటం ముందు విశ్వనాథ గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు. వేదాలు పరమార్థాన్ని వివరించారు. వేదం బోధించిన మార్గంలో పయనిస్తే అనేక ప్రయోజనాలను పొందగలమన్నారు. సనాతన వైదిక ధర్మాలు పాటించే వారిని గౌరవించడం మన అందరి ప్రధమ కర్తవ్యమన్నారు. భారత జ్యోతి అవార్డు గ్రహీత దత్తాత్రేయ వేద గురుకుల ప్రధానోపాధ్యాయులు గుల్లపల్లి శ్రీరామచంద్రమూర్తి ఘనపాఠి మాట్లాడుతూ వేద సభలు నిర్వహించడం ద్వారా సమాజానికి, దేశానికి ఎంతో క్షేమకరమన్నారు. పరిషత్ అధ్యక్షుడు శ్రీరామ భగవతి మాట్లాడుతూ త్వరలో కాకినాడలో భారీ ఎత్తున బ్రాహ్మణ గర్జన మహాసభను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యదర్శి చల్లా శ్రీనివాస నిరంజన్ మాట్లాడుతూ వేద పండితులు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ వేద సభలో సమాజ లోక హితం కోరుకుంటూ వేద స్వస్తి చేయడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. పరిషత్ ఉపాధ్యక్షుడు అయ్యగారి వెంకటేష్, నందమూరి వినోద్, వద్దిపర్తి సత్య మురళీరావు, భాను కుమార్, వెంకట్ పాల్గొన్నారు.

నత్త నయం

- నెమ్మదిగా ఈ–క్రాప్ నమోదు
- గతేడాది ఈ సమయానికి 60 శాతం పూర్తి
- సాంకేతిక లోపంతో పూర్తి కాని బుకింగ్
- తలలు పట్టుకుంటున్న వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది



పెద్దాపురం మండలంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వీహెచ్ఏ

పెద్దాపురం: వ్యవసాయ పంటల కచ్చితమైన వివరాల కోసం చేస్తున్న ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. సాంకేతిక లోపం కారణంగా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. దీంతో సిబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని రెండు మండలాల్లో ఈ క్రాప్ బుకింగ్ వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సంయుక్తం నిర్దేశించిన సమయానికి పూర్తి చేయలేక తలలు పట్టుకుంటున్నారు. గత ఏడాది ఇదే సమయానికి ఈ–క్రాప్ నమోదు శరవేగంగా చేశారు. దీని ద్వారా సంబంధిత యాప్‌లో రైతు పేరు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు, ఏయే పంట వేశారో వంటి వివరాలను నమోదయ్యాయి. ఈ–క్రాప్ బుకింగ్స్ ద్వారా కచ్చితమైన పంట, గణాంకాలను నమోదు చేస్తున్నారు. విపత్తుల సమయంలో పంట నష్టపోతే పరిహారం అందించడమే కాకుండా గత ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో రైతులకు అందేలా ఈ–క్రాప్ ఉపకరిరచింది. ప్రస్తుత ప్రభుత్వంలో సాంకేతిక లోపం కారణంగా ఈ–క్రాప్ బుకింగ్ నత్తనడకన సాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 60 శాతం పూర్తి కాగా ప్రస్తుతం 20 శాతం మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ సాగినట్లు రైతులు చెబుతున్నారు.

పంట సాగు విస్తీర్ణం

నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం మండలంలో 10 వేల ఎకరాలు, సామర్లకోట మండలంలో 23 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. మిగతా అన్ని పంటలు ఆయిల్ ఫామ్, దుంప, జీడిమామిడి తదితర పంటలు సుమారు 10 వేల ఎకరాలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ జరుగుతోంది.

ఈ–క్రాప్ నమోదు ఇలా

ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లో సంబంధిత అధికారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ–క్రాప్ నమోదు చేస్తారు. రైతుల పొలం వద్దకు అంటే సర్వే నంబర్ల ప్రకారం అధికారులు వెళ్లి ట్యాప్‌లో యాప్ ఓపెన్ చేసి క్లిక్ చేయగానే 20 మీటర్ల పరిధిలోని సర్వే నంబర్లు కనిపిస్తాయి. అనంతరం ఆ సర్వే నంబర్లలో రైతు పేరును నిర్ధారణ చేసుకుని యాప్‌లో ఏ పంట వేశారో నమోదు చేస్తోంది. పొలం వద్దే రైతు ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేసి వెంటనే ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. దీంతో ఆ సర్వే నంబర్‌కు ఏ కాలువ నుంచి సాగునీరు వస్తుంది, నీటి తీరువా ఎంత చెల్లించాల్సి ఉంటుంది వంటి వివరాలు తెలుస్తాయి. పంట చిత్రాలను జీపీఎస్ పద్ధతి ద్వారా సర్వర్‌కు పంపుతారు. సర్వే నంబర్లలో తేడాలను అధిగమించేందుకు వీఆర్‌ఓలు, ఎంపీఈఓలు సంయుక్తంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తారు. ఈ నెలాఖరులో పంట వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ అధికారులు. రెవెన్యూ శాఖ సిబ్బంది చురగ్గా ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

తప్పనిసరిగా చేయించుకోవాలి



రైతులు ఈ–క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలి. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేశాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం వాటిల్లినప్పుడు ఈ–క్రాప్ ఎంతగానో మేలు చేస్తోంది.

– ఎం.చిలకమ్మ, వ్యవసాయ సహాయకురాలు, ఆర్‌బీపట్నం, పెద్దాపురం మండలం

పక్కాగా నమోదు చేస్తున్నాం



ఈ–క్రాప్ బుకింగ్‌ను నిబంధనలకు అనుగుణంగా పక్కాగా నమోదు చేస్తున్నాం. నమోదు ప్రక్రియ వ్యవసాయ సహాయకులు, వీఆర్‌ఓలు సంయుక్తంగా చేస్తున్నారు. పంటల నమోదులో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం.

– కె.సంజయ్‌కుమార్, ఏఓ, పెద్దాపురం మండలం

పంచారామ క్షేత్రంలో సాంబశివారెడ్డి పూజలు



వైఎస్సార్ సీపీ నాయకులకు ఆశీర్వచనాలు అందజేసిన వేద పండితులు

సామర్లకోట: పంచారామ రామ క్షేత్రంలో వైఎస్సార్ సీపీ ఎన్నారై వింగ్ గ్లోబల్ కోఆర్డినేటర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరి సాంబశివారెడ్డి పూజలు బుధవారం పూజలు చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబుతో కలిసి పంచారామ క్షేత్రంలోని స్వామివారు కుమారా రామభీమేశ్వరస్వామికి అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవికి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు నియోజకవర్గ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను దొరబాబు ఈ సందర్భంగా సాంబశివారెడ్డికి వివరించారు. ఆలయంలో పూజలు అనంతరం ఆలయ పండితుల ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అయ్యారకం సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్ సేపెని సురేష్, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు బీవీ రమణ, పార్టీ నాయకులు రెడ్డి శ్రీనివాసు, దూది రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పులిమేరు ముసలమ్మ తల్లి సంబరం



సంబరంలో ఆకట్టుకున్న కాళికాదేవి వేషాలు,

పెద్దాపురం: పులిమేరు గ్రామ దేవత ముసలమ్మ తల్లి సంబరం బుధవారం వైభవంగా జరిగింది. ఏటా నిర్వహించే అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా వేకువ జాము నుంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, గరగల నృత్యం, మ్యూజికల్ నైట్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి సంబరాన్ని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, తుమ్మల నాని, బుల్లియ్య తదితరులు ప్రారంభించగా పులిమేరు, గోరింట, గుడివాడ, దివిలి, చంద్రమాంపల్లి, చదలాడ, ఉలిమేశ్వరం గ్రామాలతో పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రారంభమైన సంబర ఉత్సవంలో భాగంగా ఆయా దేవతామూర్తుల బళ్లవేషాలు, గరగలాట, బ్యాండ్‌మేళాం వంటి కార్యక్రమాలను చూపరులను ఆకట్టుకున్నాయి.

రైతు గుండె చెరువైంది!

- తగ్గని సుద్దగడ్డ వరద
- ముంపులో వరి పంటలు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు



తిమ్మాపురంలో నీట మునిగిన పంట పొలాలు



పిఠాపురం మండలంలో చెరువుల్లా మారిన పంట పొలాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో సుద్దగడ్డకు వచ్చిన వరద ఉధృతి కొనసాగుతోంది. ఈ ఉధృతి తగ్గకపోగా ఇంకా పెరుగుతోంది. దీంతో పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. దీంతో ఎక్కువ రోజులు నీటిలో ఉండి పోవడంతో ఇప్పటికే నాట్లు పైకి లేచి పోవడంతోపాటు వరి దుబ్బులు కుళ్లి పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊడ్చిన వరి పంటలు ఊడ్చిపెట్టుకు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ఉధృతి తగ్గడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు, సుద్దగడ్డ తదితర ప్రధాన పంట కాలువలు పొంగి పొర్లుతుండడంతో పంట పొలాలు నీట మునిగి ఇప్పటి వరకు నాట్లు వేసిన పొలాలు పూర్తిగా దెబ్బ తిన్నాయని రైతులు వాపోతున్నారు. పిఠాపురం మండలంలో పి.తిమ్మాపురం, జములపల్లి, రాయవరం, రాపర్తి , గొల్లప్రోలు మండలంలో లక్ష్మీపురం, చేబ్రోలు, సీతానగరం తదితర గ్రామాల్లో వరి పంట బుధవారం నాటికి తగ్గుముఖం పట్టలేదంటున్నారు. అయితే పంటలను పరిశీలించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పుడు ఒకే చోట పరిశీలించి వెళ్లి పోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పూర్తిగా నీట మునిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమను పట్టించుకోడం లేదని పిఠాపురం మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సారా రహిత వార్డులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

సామర్లకోట: పట్టణంలో సారా రహిత వార్డులుగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహనరావు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా బ్రౌన్‌పేట, బలుసులపేట, గాంధీనగర్ వార్డులకు సంబంధించి గ్రామ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. గతంలో సారాతో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించామని, ఆయా కుటుంబాలకు చెందిన వారు సారా విక్రయాలు, తయారీకి దూరంగా ఉంటామని హామీ ఇచ్చారని సీఐ తెలిపారు. ఈ మేరకు ఆయా కుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వానికి సూచించామని చెప్పారు. సారా విక్రయాలు చేసే వారి హామీ మేరకు గాంధీనగర్, బలుసులపేట, బ్రౌన్‌పేటలను సారా రహిత వార్డులుగా ప్రకటించామని సీఐ తెలిపారు. ఈ తరుణంలో సారా విక్రయాలు జరిగితే కేసులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పద్మజారెడ్డి, కౌన్సిలర్లు పాలిక కుసుమ, పిట్టా సత్యనారాయణ, ఎక్సైజ్ ఎస్సై ఎం వీవీబీ కుమార్, హెచ్‌సీ వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యాధికారి సుష్మకు సత్కారం



సుష్మను శాలువాతో సత్కరిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు పొందిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మాను బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శాలువతో సత్కరించారు. ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన హెచ్‌సీఎల్ కంపెనీ రీజనల్ హెడ్




కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన హెచ్‌సీఎల్ కంపెనీ రీజనల్ హెడ్ పాట్నర్ వినోద్

కాకినాడ సిటీ: హెచ్‌సీఎల్ కంపెనీ రీజనల్ హెడ్ పాట్నర్ డి.వినోద్ బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిర్వహిస్తున్న ఎరైజ్4యూ ప్రోగ్రాం ద్వారా జరగబోయే శిక్షణా కార్యక్రమాలను వివరించారు. హెచ్‌సీల్ టెక్నాలజీస్ ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను, ఇన్నోవేటివ్ ఐడియాలజీ ద్వారా వివిధ ప్రాజెక్టులను తయారు చేయడానికి హెచ్‌సీఎల్ కంపెనీ నిర్వహిస్తున్న ఎరైజ్4యూ ప్రోగ్రామ్ ద్వారా 40 రోజుల పాటు శిక్షణ ఇస్తుందన్నారు. ఈ శిక్షణకు ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వికాస కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ ప్రోగ్రామ్ ప్రచారంలో భాగంగా వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్.. పబ్లిక్ సేఫ్..

- కాకినాడ నగరంలో జరుగుతున్న కార్డన్ సెర్చ్
- శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా తనిఖీలు
- ప్రజల్లో గందరగోళం
- భయపడొద్దంటున్న పోలీసులు



కార్డన్ సెర్చ్‌లో పోలీస్ పహరా

కాకినాడ క్రైం: నగరంలో కార్డన్ సెర్చ్‌లు జరుగుతున్నాయి. తరచూ చేపడుతున్న ఈ తనిఖీల వల్ల నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ సాధ్యమవుతోందని పోలీసులు అంటున్నారు. అయితే ఒకేసారి గుంపుగా పోలీసులు రావడం, తమ ప్రాంతాలను చుట్టుముట్టి ఇళ్లల్లోకి వెళ్లి సోదాలు చేయడం, వాహనాలు తనిఖీలు, అనుమానితుల్ని ప్రశ్నించడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆరా తీయడం వంటివి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో ఇదో ప్రక్రియ అని పోలీసులు చెబుతున్నా ప్రజల్లో మాత్రం భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు కార్డన్ సెర్చ్ అంటే ఏంటీ, ఎందుకు చేస్తారు, ఎలా చేస్తారు, ప్రయోజనం ఏంటీ అన్న అంశాలతో పాటు కాకినాడ నగరంలో చేపడుతున్న కార్డన్ సెర్చ్ వల్ల చేకూరిన ప్రయోజనాలను వివరిస్తూ సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం

కార్డన్ సెర్చ్‌కు ఎందుకంటే..

ఓ ప్రాంతాన్ని పోలీసులు పూర్తిగా చుట్టుముట్టి నిర్ణీత సమయంలోపు ఎవరినీ బయటకి వెళ్లకుండా, బయటి వారిని లోపలికి రానివ్వకుండా ఇళ్లు, భవనాలు, వాహనాలను తనిఖీ చేస్తారు. నేరస్తులు, సంఘ విద్రోహ శక్తుల్ని గుర్తించడం, అక్రమ వస్తువులు, ఆయుధాలను గుర్తించడం, అసాంఘిక, అక్రమ కార్యకలాపాలకు చెక్ పెట్టడం, మాదక ద్రవ్యాల నివారణ, శాంతి భద్రతల పర్యవేక్షణకు ఈ కార్డన్ సెర్చ్‌ని చేస్తారు.

తనిఖీలు ఇలా..

కార్డన్ సెర్చ్ నిర్వహించేందుకు ఓ నిర్దిష్ట ప్రక్రియ ఉంది. ముందు నేర కార్యకలాపాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తిస్తారు. తెల్లవారు జామున లేదా రాత్రి వేళల్లో ఎక్కువగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తారు. నిర్ణీత ప్రాంతాలను పోలీసులు చుట్టుముడతారు. వీరు బృందాలుగా విడిపోయి ఇళ్లు, దుకాణాలు, వాహనాల తనిఖీ చేస్తారు. అనుమానాస్పద వస్తువులు ఉంటే వెతుకుతారు. ఇళ్లల్లోని వ్యక్తుల గుర్తింపు కార్డులు తనిఖీ చేస్తారు. పాత నేరస్తులు, అనుమానితుల వివరాలను ఆరా తీస్తారు. పరిశీలన, తనిఖీ కోసం పలు వస్తువులు స్వాధీనం చేసుకోవడంతో పాటు అనుమానం ఉన్న వ్యక్తుల్ని అరెస్టు చేసే హక్కు ఉంటుంది. సెర్చ్ పూర్తయిన తర్వాత తిరిగి ఆయా ప్రాంతాలలో యథా స్థితిలో జనజీవనం కొనసాగుతుంది.



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ దేవరాజ్

మూడు నెలల్లో ఏడు సెర్చ్‌లు

కాకినాడ, పరిసర ప్రాంతాల్లో మూడు నెలల్లో ఏడు కార్డన్ సెర్చ్‌లు నిర్వహించారు. ఆగస్టు 6, 10 తేదీల్లోను, జూలైలో 18, 20 తేదీల్లోను, జూన్ 13న, మేలో 14, 25 తేదీల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 93 మందిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. తగిన రికార్డులు లేని 117 వాహనాలను సీజ్ చేశారు. పలువురు అనుమానితుల్ని అదుపులోకి తీసుకున్నారు. అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పలువురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకొని దొంగతనాలు నేరపూరిత చర్యల ప్రణాళికలు స్వాధీనం చేసుకున్నారు. నేరాలు జరగకుండా ఆపగలిగారు. గంజాయి క్రమ విక్రయాలకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టురట్టు చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. పలు వ్యభిచార కార్యకలాపాలు నిలువరించారు. ఇలా కార్డన్ సెర్చ్ ఫలితాలు ఆశాజనకంగా ఉండడంతో తరచూ ఈ తనిఖీలు నిర్వహించడానికి అధికారులు మొగ్గు చూపుతున్నారు. కాకినాడలో ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ప్రజలు భయపడొద్దు



ప్రజలు తమ ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ జరిగితే కంగారు పడొద్దు. కార్డన్ సెర్చ్ లక్ష్యాన్ని తెలుసుకోవాలి. తనిఖీలు చేస్తున్న పోలీసులకు సహకరించాలి. నేర ప్రవృత్తి లేని ఏ ఒక్కరికీ పోలీస్ చర్యల వల్ల ఎలాంటి హాని ఉండదు. కార్డన్ సెర్చ్‌లు నిర్వహించడం వల్ల నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ జరుగుతుంది. జరగబోయే నేరాల నియంత్రించవచ్చు. తద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలోనే చేస్తున్నాం. నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలనే కార్డన్ సెర్చ్‌కు ఎంచుకుంటున్నాం. ఈ తనిఖీలు సత్ఫలితాలిస్తున్నాయి.

– దేవరాజ్ మనీష్ పాటిల్, ఏఎస్పీ, కాకినాడ

నవరాత్ర ఉత్సవాలకు రాట ముహూర్తం



సామర్లకోట విశాలాక్షినగర్‌లో రాట వేస్తున్న మహిళలు



కొత్తపల్లిలో నవరాత్ర మహోత్సవాలకు పందిరిరాట వేస్తున్న భక్తులు

సామర్లకోట: గణపతి నవరాత్ర ఉత్సవాలను నిర్వహించేందుకు స్థానిక విశాలాక్షినగర్‌లో బుధవారం మహిళలు రాట ముహూర్తం చేశారు. ఈనెల 27 నుంచి గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గత మూడేళ్లుగా విశాలాక్షినగర్‌లో మహిళలతో చవితి వేడుకలు నిర్వహించడంతోపాటు నిమజ్జన కార్యక్రమం జరగుతుందన్నారు. దేశిన సూర్య ఉదయ్‌భాస్కర్, రవికుమార్, మహిళలు పాల్గొని పూజలు చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

40వ గణపతి నవరాత్రులకు పందిరి రాట

కొత్తపల్లి: ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్ర ఉత్సవాలకు బుధవారం పందిరి రాట ముహూర్తం చేశారు. స్థానికంగా ఉన్న పోలమ్మ గుమ్మం సెంటర్లో గణపతి మందిరం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ యూత్ ఆధ్వర్యంలో ముత్తైదువులు పందిరి రాట వేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణపతి నవరాత్రులు సందర్భంగా ఆలయాల వద్ద స్వామివారికి ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేయనున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జేసీ, ఎమ్మెల్యే

పెద్దాపురం: ఈ నెల 23న సీఎం చంద్రబాబు పెద్దాపురం నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహూల్ మీనా, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, జ్యోతుల నవీన్, సీఎంఓ కార్యాల సిబ్బంది ఏర్పాట్లు పరిశీలించారు. స్థానిక సామర్లకోట రోడ్డులోని హెలీప్యాడ్, ఎదురుగా లే అవుట్‌లో ప్రజా వేదిక, మరిడమ్మ అమ్మవారి ఆలయ దర్శనం, అనంతరం ఎదురుగా ఉన్న పార్కు నిర్మాణానికి శంకుస్థాపన పనులను వారు పరిశీలించారు. ఏర్పాట్లు పరిశీలన అనంతరం ఉన్నతాధికారులు, సీఎంఓ కార్యాలయం నిర్ణయం మేరకు పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో వారి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కుమారస్వామి, ఆర్డీఓ శ్రీరమణి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.